క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని 4వ వార్డులో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే

సింహాద్రిపురం : ఏపీ రాష్ట్రానికి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే వస్తాడని హైదరాబాదుకు చెందిన సజ్జరనసీన్ దర్గా పీఠాధిపతి మన్సూర్ అహమ్మద్ షాహీఖాదరి అన్నారు. మంగళవారం ఆయన సింహాద్రిపురంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఆయనను మళ్లీ సీఎంను చేస్తాయన్నారు.

చౌడేశ్వరీ అమ్మవారి చీరలకు వేలం పాట

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి చీరెల వేలంపాటను సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అందించిన చీరెలను ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా వేలం వేస్తుంటారు. పట్టు చీరెలు సహితం అమ్మవారి పాటను రూ.100 నిర్ణయించి అక్కడ నుంచి వేలం పాటను కొనసాగించారు. ఇలా చీరెల వేలం పాటలో వచ్చిన మొత్తంను ఆలయం అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

గడప గడపకు అయోధ్య అక్షింతలు పంపిణీ


అక్షింతలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

పెద్దముడియం : అయోధ్య రామాలయం నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను సోమవారం పెద్దపసుపుల గ్రామంలోని గడప గడపకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని మహిళలు కలశాలలో రాములోరి అక్షింతలకు గ్రామోత్సవం నిర్వహించి గడప గడపకు పంపిణీ చేశారు.

సగరులకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : సగర కులస్తులకు రాబోయే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్లోని సగర సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సగర కులస్తులు 25లక్షల మంది ఉన్నారని దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీటు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.రామకృష్ణ, రాష్ట్ర సగర సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు పంజగల మురళీ, నాయకులు కొత్తపల్లి నరసింహా, కేశవ్, లక్ష్మినారాయణ, కొండయ్య, హరి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ఎస్సీ కమిషనర్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అయన్ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు దళిత సోదరులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. బాబు, శ్యాంసన్, జ్యోతి, బండి రమణ, పి. శివ, సీహెచ్ సునీల్, లక్ష్మినారాయణ, శరత్ బాబు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

19 నుంచి క్రికెట్ పోటీలు

మైదుకూరు : పట్టణంలో గణేష్ రాయల్స్ (ఎంసీసీ) ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనే జట్లు 17వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతకు మొదటి బహుమతి రూ.50వేలు, రన్నరప్‌కు రూ.30వేలు నగదు అందజేస్తామని వారు పేర్కొన్నారు. వివరాలకు 98850 53115, 98850 68818, 98858 62682 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

- రంగ వల్లులతో కళ కళలాడిన వీధులు
- ఆలయాలలో ప్రత్యేక పూజలు


చదిపిరాళ్లలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కొండపేట పెన్నానది పార్వేట ఉత్సవంలో శ్రీ ఉమామహేశ్వరులు

పులివెందుల టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ఇంటింటా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. తెల్లవారు జామునలేచి తలంటు స్నానాలు ముగించుకుని ఇంటి ముంగిట మహిళలు రంగు, రంగుల ముగ్గులను వేశారు. గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించి పూజలు చేశారు. చిన్నారులకు ఉదయం రేగి పండ్లు తలపై వేస్తే మంచిది కావడంతో ఆ ఆచారాన్ని ఆచరించారు. ముగ్గులు వేయడంలో మగువలు పోటీ పడ్డారు. బంధువులు, మిత్రులతో ఆనందంగా గడిపారు. పట్టణం నుంచి గ్రామాలకు వెళ్లి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గాలి పటాలు ఎగుర వేశారు. కోడి పందాలు, గ్రామ ఆటలతో ఉత్సాహంగా జరిగింది. మగువలు సాంప్రదాయ దుస్తులతో కనువిందు చేస్తూ ఆచారాన్ని పాటించారు. మంగళవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, ఎర్రబల్లె, కొత్తపల్లె, మోట్నూతలపల్లె గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు.

శిల్పారామంలో..

పులివెందుల శిల్పారామం సందర్శకులతో నిండుకుండలా కనువిందుచేసింది. శ్రీరాజా కళానిలయం మాస్టర్ రాజా ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తూ ఆనందంగా గడిపారు. అలాగే గరండాల రివర్ ఫ్రంట్(రాణితోపు)లో నిర్వహిస్తున్న సురభి నాటకాలలో భాగంగా మంగళవారం శ్రీకృష్ణ తులాభారం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సందర్శకులతో కిటకిటలాడింది.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో సోమవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా సుమారు 80 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొని బహుమతులను అందుకున్నారు. మొదటి బహుమతి నక్కా స్వాతికి ఎంపీటీసీ రాజకుమార్ చేతుల మీదుగా వెండి దీపాలు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు సంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్లు, సంఘం మాజీ అధ్యక్షులు రెడ్డయ్య, రంగయ్య, ఉపాధ్యక్షులు రామచంద్ర, కోశాధికారి సునీల్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దులకొండపై వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పురవీధులగుండా మంగళవాయిద్యాలతో ఊరేగించారు. స్థానిక వృషభాచలేశ్వరస్వామి ఆలయ అనుసంధానంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుర్రాకుల వెంకటేసు, ఓబులమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చిన్నస్వామి, హరిప్రవీణ్, నేతృత్వంలో పురోహితులు శాస్త్రోయుక్తంగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వైభవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ రంగప్రసాద్, లక్ష్మిరెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి వేడుకలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధు మిత్రులతో పండుగ వేడుకలను ఉల్లాసంగా సంతోషంగా గడిపారు. సంకాంతి పండుగను పురష్కిరించుకుని మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంపీటీసీ మనోహరరెడ్డి మహిళలకు పిల్లలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బహుమతులు ప్రధానం చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని తదితర గ్రామాలలో సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంట్లో పిండివంటలు చేసి బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అల్లుళ్లు అత్త గారిండ్లకు చేరుకున్నారు. మహిళలు మూడు రోజుల పాటు రంగ వల్లులు వేస్తూ, పిండి వంటలు చేస్తూ బిజీ బిజీగా కనిపించారు. గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. టి.చదిపిరాళ్ల గ్రామంలో స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి గ్రామ శివారు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజల సమక్షంలో గొళ్లపల్లె వంక వద్ద కుందేలును పారువేటకు వదిలారు. పట్టుకున్న వారికి బహుమతులు అందజేశారు. ఎర్రగుడిపాడులో సోమవారం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామికి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి వారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద కనుమ పండుగ పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన పారువేట ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పురుషులకు కబడ్డీ, బండ లాగుడు పోటీలు, రన్నింగ్ రేస్, మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం నుంచి పాగేరు వంక వరకు శివ పార్వతులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అలాగే కంచి వరదరాజ స్వామి వారిని ఆలయం నుంచి పాగేరు వంక వరకు ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు.

ఘనంగా పార్వేట ఉత్సవం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథస్వాముల పార్వేట ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండపైన వున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీపై ఆశీనులను చేసి గ్రామంలోకి మోసుకుని వచ్చారు. అనంతరం స్వామివార్లతో పాటు శ్రీ కామాక్షి సమేత వైద్యనాథేశ్వరస్వామిని దివిటీల వెలుగులు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు పల్లకీలలో మోస్తూ గ్రామం పక్కన గల పొలాల్లోకి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు స్వామి వార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. పార్వేటకు ముందు కుందేలుకు స్వామివార్ల ఎదుట పూజలు చేశారు. అనంతరం జరిగిన పార్వేట ఉత్సవంలో ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. అనంతరం పుష్పగిరి మాడ వీధులలో ఇరువురు స్వాములకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లెలో శ్రీ కృష్ణ యూత్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మంగళవారం ముగిశాయి. సంబరాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. మర్రిపల్లె గ్రామానికి చెందిన యువకులు విన్నర్స్‌గా నిలిచారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందురెడ్డి, టీసీ నాయకుడు ప్రతాప్‌యాదవ్, ఆలయ నిర్వాహకుడు రాజశుఖర్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రతి గ్రామంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కోలాటాలు చెక్కభజనలతో నిర్వహించారు. గౌరమ్మను ఊరేగించారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని కొండపేట పెన్నానదిలో మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని ఉమామహేశ్వర పర్వేటు ఉత్సవాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగింపుగా పెన్నానది వద్దకు తీసుకువచ్చారు. వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చెన్నూరు, కొండపేట తదితర గ్రామాలకు చెందిన మహిళలు గొబ్బెమ్మలతో పెన్నానది వరకు వెళ్లి గొబ్బెమ్మలను నదిలో నిమజ్జనం చేశారు.

పెండ్లిమర్రిలో...

పెండ్లిమర్రి : మండలంలోని ప్రజలు మకర, కనుమ పండుగలను చిన్నా, పెద్దా తేడా లేకుండా వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముంగింట ముగ్గులు వేశారు. చిన్న పిల్లలు గాలి పటాలు, కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, పాటలకచేరివంటి ఆటలతో ఆడుకుంటు కేరింతలు కొట్టారు. పండుగ సందర్భంగా బంధువులతో ఇళ్లన్ని సందడిగా మారాయి. వెయ్యినూతలకోన క్షేత్రంలో మరక సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయ ధర్మ కర్త నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. పెండ్లిమర్రి అయ్యప్పస్వామి ఆలయంలో మరక జ్యోతి దర్శనం కల్పించారు. మమ్ముసిద్దుపల్లె గ్రామంలో రామాలయం వద్ద గొబ్బెమ్మను ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించి మహిళలచే కోలాటం నిర్వహించారు. అలాగే వెల్లటూరులో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం మరక సంక్రాంతి రోజున శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వస్వామి కల్యాణం ఆలయ ఈఓ శ్రీనువాసులు, ఆలయ చైర్మన్ గురివిరెడ్డి, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బండలాగుడు పోటీలో 22 జతల ఎద్దులు పాల్గొనగా గెలుపొందిన ఎద్దులకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : సంక్రాంతి పర్వదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన వేడుకల్లో పలు కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొన్నారు. ఇంటిముందు ముగ్గులు, గొబ్బిళ్ళు, పార్వేట ఉత్సవాలతో సంతోషంగా సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. సంక్రాంతి, కనుమ పర్వదినం సందర్భంగా గ్రామోత్సవాల్లో స్థానికులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చివరి రోజున కనుమ సంక్రాంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం ఎర్రగుంట్లలో పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. నడివూరులోని శ్రీ రామాలయ దేవాలయం నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంను ఊరేగింపు నిర్వహించారు. మహిళలు శ్రీరామ భక్తి గీతాలతో భజన నిర్వహించారు. చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


వేంపల్లె గ్రామోత్సవంలో వృషభాచలేశ్వరస్వామి


వల్లూరు : శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామివార్ల గ్రామోత్సవం


ఎర్రగుంట్ల : పార్వేట ఉత్సవంలో శ్రీరామ భక్తి గీతాలను ఆలపిస్తున్న మహిళలు


ముద్దనూరు : యామవరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం


వెయ్యినూతలకోనలో నరసింహస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


సింహాద్రిపురంలో ముగ్గుల పోటిల్లో పాల్గొన్న మహిళలు


పులివెందులలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు


శిల్పారామంలో నిండుగా దర్శనమిస్తున్న శిల్పారామం


వీఎన్‌పల్లెలో బహుమతులు అందజేస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి


పులివెందులలో ఇంటిముందు ఆకర్షణగా వేసిన ముగ్గు

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది కాంగ్రెస్ పార్టీనే

– నూరుబాషా కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రసూల్

పులివెందుల రూరల్ : ఏపీ రాష్ట్రం సర్వనాశనం కావడానికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే ముఖ్య కారణమని నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రం విడి పోవడానికి ముఖ్యభూమిక పోషించిన పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే అన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ పాదయాత్రలో చెప్పిన విధంగా నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన వారికి పథకాలు అందించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

బడుగు బలహీన వర్గాల వారికి ఆశా జ్యోతిగా నిలిచారన్నారు. 66 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2024 ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుపొందుతుందన్నారు.

ఘనంగా ఆర్టీసీ భద్రత వారోత్సవాలు

జమ్మలమడుగు : స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆర్టీసీ భద్రత వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రవీన్ మాట్లాడుతూ బస్సులను నడిపేటప్పుడు డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణీకులకు భరోసాను ఇస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్‌ఖాదర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు విధులకు బయలు దేరే ముందు తమకుటుంబ సభ్యులను ఒకసారి గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అధికారులు, డ్రైవర్లు, గ్యారేజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిపో మేనేజరు ప్రవీన్

నాడు–నేడు పనుల పరిశీలన


జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కవితతో పూర్వపు విద్యార్థులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం పాఠశాల పూర్వపు విద్యార్థులు నాడు–నేడు ఫేజ్–1 పనులు పూర్తయిన సందర్భంగా సందర్శించి హర్షం వ్యక్తం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.జె.పి.కవిత తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ మేము చదువుకునే రోజుల్లో ఇలాంటి మౌలిక వసతులు లేవని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం హర్షణీయమని, ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లు, ట్యాబ్‌లు, రక్తహీనతకు ఐరన్ ట్యాబెట్లు, జగనన్న గోరుముద్దలో గుడ్లు, రాగిజావ, చిక్కీ వంటి విద్యార్థులకు అందిస్తున్నారని, అలాగే జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు అందజేస్తున్నారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆప్తుడు రామయ్య


రామయ్య(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : పేదల ఆప్తుడు రామయ్య అని, ఆయన లేని లోటు తీర్చలేనిదని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గం సమన్వయ్యకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ సోమిరెడ్డిపల్లె (బీ.మఠం) సర్పంచ్ రామయ్య(70) మంగళవారం బెంగుళూరులో మృతి చెందారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం తన కుమారుడి దగ్గరకు వెళ్లిన ఆయన తుదిశ్వాస విడిచారు. నరసన్నపల్లె ఎస్సీ కాలనీలో జన్మించిన రామయ్య ఆర్మీలో పనిచేశారు. అనంతరం రాజకీయాల్లో రాణించారు. రామయ్య సర్పంచ్ అయిన తరువాత పంచాయతీలోని పలు గ్రామాల్లో ఎవరైనా ఎస్సీలు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5వేలు చొప్పున సాయం చేసేవారు. ఆయన భార్య, మరో కుమారుడు కరోనాతో ఒకేరోజు చనిపోయారు.

చర్చి నిర్మాణానికి ఎంపీ సహకారం

ఖాజీపేట : కూనవారిపల్లె హరిజనవాడలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఖాజీపేట మండలం కూనవారిపల్లె పంచాయతీలోని హరిజనవాడలో నూతనంగా చర్చి నిర్మిస్తున్నారు. చర్చి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డిలు ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చర్చి నిర్మాణానికి రూ.2 లక్షలను ప్రకటించారు. మంగళవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా నగదును చర్చి నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న సీఎం జగన్ చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. అందుకు బస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డితోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా గండి అంజన్న గ్రామోత్సం

చక్రాయపేట : మకర సంక్రాంతి పర్వదినం పురష్కరించుకుని సోమవారం సాయం త్రం గండి వీరాంజనేయస్వామి గ్రామోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రత్యేక పుష్పాలంకరణతో ఉన్న రథంలో ఉన్న ఉష్ట్ర వాహణంపై అంజన్న ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగింపు చేశారు.ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు రాజారమేష్, రాజ గోపాలాచార్యులు, గ్రామోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణతో పాటు ఉదయం నుంచి వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వేదపారాయణదారు రామమోహనశర్మ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వాహణంపై ఊరేగుతున్న గండి వీరాంజనేయుడు

సురభి నాటకాలకు విశేష స్పందన


వైజాగ్ కలెక్టర్ దంపతులను సత్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల : సంక్రాతి సందర్భంగా స్థానిక గరండాల రివర్ ఫ్రంట్(రాణితోపు)లో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా సోమవారం మూడోరోజు వైజాగ్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దంపతులు ఈ నాటకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డిలు కలెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

అనంతరం వారు పాతాళ భైరవి నాటకోత్సవాన్ని కాసేపు తిలకించారు. సురభి నాటకోత్సవాలను తిలకించేందుకు ఆప్రాంతం నిండుగా ప్రజలతో కనువిందుచేసింది.

చెస్‌లో కడప క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్: బెంగళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ బీఆర్‌డీసీఏ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఈనెల 11వ తేదీన నిర్వహించిన ఆన్‌లైన్ ఓపన్ చెస్ పోటీల్లో 50 ప్లస్ విభాగంలో అనీస్‌దర్బారీ 6 పాయింట్లతో రెండోస్థానం, అండర్–15 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడోస్థానంలో నిలిచారు. వీరితో పాటు అండర్–11 బాలికల విభాగంలో లక్ష్మీమనుశ్రీ మూడోస్థానం, అండర్–9 బాలికల విభాగంలో అమీనా 5వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనీస్‌దర్బారీ తెలిపారు.